నేడు శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

నల్లకుంట: ప్రశాంత్‌నగర్‌లో గల శ్రీ కుసుమ హరనాథ ఆశ్రమంలో ఈ నెల 26న (నేడు) శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆశ్రమ నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సామూహిక గీత పారాయణం, విష్ణు సహస్రనామ పారాయణం ఒంటి గంటకు ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు శ్రీ రాధాకృష్ణుల సంకీర్తన, ఊయల సేవ, అలాగే 8 నుంచి 8.30 గంటల వరకు నిత్య సేవలు ఉంటాయని తెలిపారు.

నూతన కమిటీ ఎన్నిక



అంబర్‌పేట్: ఇంద్రానగర్ తిలక్ నగర్ శ్రీ గంగాభవాని అసోసియేషన్ శ్రీ ముత్యాల పోచమ్మ దేవాలయ కమిటీ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. చైర్మన్‌గా చందర్, అధ్యక్షులుగా అశోక్, ప్రధాన కార్యదర్శి కాముని సాయికిరణ్ ఎన్నికయ్యారు.

దీన్‌దయాళ్‌నగర్ బస్తీ అధ్యక్షుడిగా నరేష్



ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ దీన్‌దయాళ్ నగర్ బస్తీ అధ్యక్షుడిగా ఎస్.నరేష్ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఎస్.నరేష్‌తో పాటు ఆయన ప్యానెల్ విజయం సాధించింది. ఉపాధ్యక్షులుగా ఏ.శ్రావణ్, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రావణ్, కార్యదర్శిగా ఎల్.రాము, కోశాధికారిగా శ్రీనివాస్, ధీరజ్‌కుమార్‌లు ఎన్నికయ్యారు. వీరు విజయం అనంతరం గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే ముఠా గోపాల్ నివాసానికి వెళ్లి ఆయన కుమారుడు ముఠా జైసింహను కలిశారు. ఆయన నూతన కార్యవర్గాన్ని అభినందించి సన్మానించారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



కమ్యూనిటీ హాల్ అదనపు గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్

అంబర్‌పేట: మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పేర్కొన్నారు. బాగ్ అంబర్‌పేట డివిజన్ రామకృష్ణనగర్‌లోని పార్కులో నిర్మించిన కమ్యూనిటీ హాల్ అదనపు గదిని స్థానిక కార్పొరేటర్ పద్మతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల అవసరాలకు అనుగుణంగా దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ జ్యోతిరెడ్డి

ముషీరాబాద్: నవభారత, వనితా లయన్స్ క్లబ్ సంయుక్తాధ్వర్యంలో ఆదివారం ముషీరాబాద్‌లోని రెయిన్‌బో హోమ్ అనాథాశ్రమంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికలకు డాక్టర్ పి.జ్యోతిరెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొగ్రెసీవ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్షురాలు హిప్నో పద్మాకమలాకర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. చదువుతో పాటు ప్రతిరోజు వ్యాయామం చేయాలని అప్పుడే ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు కృష్ణవేణి, రెయిన్‌బో హోమ్ ఇన్‌చార్జీ సదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ సభ్యత్వాన్ని విస్తృతంగా చేపట్టాలి



చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

అంబర్‌పేట: బీజేపీ సభ్యత్వాన్ని విస్తృతంగా చేపట్టాలని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. బర్కత్‌పురలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్ష్యం మేరకు ప్రతి పార్టీ కార్యకర్త సభ్యత్వ నమోదు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, మాజీ మంత్రి కృష్ణయాదవ్, కార్పొరేటర్ కన్నె ఉమారమేశ్‌యాదవ్, నాయకులు వినోద్ యాదవ్, కన్నె రమేశ్‌యాదవ్, కృష్ణకుమార్, అరవింద్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఏకీకృత పెన్షన్ అమలు అభినందనీయం



మద్దూరి శివాజీ

ముషీరాబాద్: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఏకీకృత పెన్షన్‌ను వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి అమలులోకి తీసుకొస్తామని కేంద్ర నిర్ణయం అభినందనీయమని దీనివల్ల లక్షలాది మందికి ప్రయోజనం చేకూరుతుందని బీజేవైఎం సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షులు మద్దూరి శివాజీ అన్నారు. ఆదివారం రాంనగర్‌లో ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు ఉద్యోగుల సంక్షేమం కోసం ప్రధాని మోదీ కృషి చేస్తున్నారన్నారు. ఈ కొత్త పథకం వల్ల ఉద్యోగులకు చివరి 12 నెలల మూలవేతనం సగటులో పెన్షన్‌గా 50 శాతం పొందే వెసులుబాటు కల్పించారన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల కేంద్ర ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా రాష్ట్ర ఉద్యోగులకు అమలు చేయాలని ఆయన కోరారు.

వైద్యులు లేరు.. వైద్యం అందదు

డాక్టర్లు లేక నెలరోజులుగా జనం అవస్థలు

వైద్యం.. ప్రజల కనీస అవసరం.. ఇది ప్రభుత్వం అందించాల్సిన కనీస బాధ్యత.. అయితే ఈ వైద్యం లాలాపేటలో మాత్రం అందడం లేదు.. అధికారులూ పట్టించుకోవడం లేదు.. ప్రభుత్వమూ గాలికి వదిలేసింది.. దీంతో జనం చికిత్స కోసం అవస్థలు పడుతున్నారు.

– లాలాపేట



లాలాపేటలోని పట్టణ ఆరోగ్య కేంద్రం

తార్నాక డివిజన్ లాలాపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు లేక దాదాపుగా నెల రోజులు గడుస్తోంది. దీంతో వైద్య సేవలకు తీవ్ర ఆంతరాయం ఏర్పడింది. ఇటీవల వైద్య శాఖలో జరిగిన బదిలీల్లో ఇక్కడ ఇంతకాలం విధులు నిర్వహించిన వైద్యులు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఈ ఆరోగ్య కేంద్రానికి కొత్త వైద్యులు రాలేదు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంబీబీఎస్ వైద్యులు అందించాల్సిన వైద్యాన్ని ఓ ఆయుష్ డాక్టర్‌తో, సిస్టర్స్‌తో అందిస్తూ హాస్పిటల్‌ను నిర్వహిస్తున్నారు. ఒక వైపు విష జ్వరాలతో బాధపడుతున్న వారు హాస్పిటల్‌కు క్యూ కడుతుంటే చేసేదేమి లేక సిబ్బంది పక్కనే ఉన్న పట్టణ సామాజిక కేంద్రానికి పంపిస్తున్నారు. రోగుల తాకిడి ఎక్కువై అక్కడా సరైన వైద్యం అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అయినా పట్టించుకునే వారే లేరు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలోనే వైద్యం అందించేవారు అందుబాటులో లేని వైనం నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే వైద్యులను నియమించాలనీ కోరుతున్నారు.

బంగ్లాదేశ్‌లో దాడులను అరికట్టాలి



భోలక్‌పూర్ దేవునితోట నుంచి ర్యాలీ నిర్వహించిన హిందూ సంరక్షణ సమితి

ముషీరాబాద్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఇతిహాస్ సంకల్పన సమితి నాయకులు శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం భోలక్‌పూర్‌లోని దేవుని తోట నుంచి హిందూ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ హుస్సేన్‌సాగర్ స్వామి వివేకానంద విగ్రహం వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఇతిహాస్ సంకల్పన సమితి సీనియర్ నాయకులు శంకర్ మాట్లాడుతూ.. బాలికలు, మహిళలపై బంగ్లాదేశ్‌లో అత్యాచారం చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే దాడుల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. హిందూ సంరక్షణ సమితి నాయకులు ఆంజనేయులు, నాగేందర్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు బిజ్జి కనకేష్‌కుమార్, ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్ రామ్, నాయకులు వనజకుమార్, వెంకటేష్, జగదీష్‌బాబు, శివ, రాజు, నర్సింగ్, శ్రీను, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'మాజీ ఎంపీ వీహెచ్‌కు క్షమాపణ చెప్పాలి'

నల్లకుంట: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ హన్మంతరావు (వీహెచ్)పై విమర్శలు చేసిన బీఆర్ఎస్ నేత ఎర్ల సుధాకర్ రెడ్డి తక్షణమే ఆయనకు క్షమాపణలు చెప్పాలని ఖైరతాబాద్ డీసీసీ ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణ గౌడ్ డిమాండ్ చేశారు. బాగ్ అంబర్‌పేటలోని ఆయన కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బతుకమ్మకుంట స్థలంపై వీహెచ్ హైడ్రాకు ఫిర్యాదు చేస్తే సుధాకర్ రెడ్డి ఎందుకు ఉలికి పడుతున్నారని ప్రశ్నించారు. ఐదు దశాబ్దాలకు పైగా రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న సీనియర్ నేతపై పదేళ్ల క్రితం రాజకీయాల్లోకి వచ్చిన వ్యక్తి విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. సుధాకర్ రెడ్డి వెంటనే వీహెచ్‌కు క్షమాపణ చెప్పాలని, లేకుంటే ఆయన ఇంటిని ముట్టడిస్తారని హెచ్చరించారు.

పింగళి వెంకయ్య తెలుగువారు కావడం గర్వకారణం



కార్యక్రమంలో ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జనార్దనమూర్తి తదితరులు

చిక్కడపల్లి: జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య యాదిలో కళాసుబ్బారావు కళావేదికలో సంస్మరణ సభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ మధుసూదనచారి హాజరై మాట్లాడారు. జాతీయ జెండాను రూపకల్పన చేసిన పింగళి వెంకయ్య తెలుగువారు కావడం మనందరికి గర్వకారణమని కొనియాడారు. దేశ స్వాతంత్య్ర పోరాటంలో గాంధీజీ పిలుపును అందుకుని ఉద్యోగాన్ని వదిలేసి సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొన్న ఆయన నిరాడంబరుడన్నారు. గానసభ అధ్యక్షుడు కళాజనార్దనమూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు భూపాలకృష్ణ, రామసత్యనారాయణ, పీఎస్ఆర్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

యువత ఉపాధి వైపు పయనించాలి



ఉచిత డ్రైవింగ్ శిక్షణను ప్రారంభిస్తున్న చంద్రమౌళి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: యువత ఉపాధి వైపు పయనించి ఇతరులకు ఉపాధి కల్పించేలా ఎదగాలని ప్రముఖ విద్యావేత్త చంద్రమౌళి అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో ఉచిత డ్రైవింగ్ శిక్షణ 17వ బ్యాచ్‌ను ప్రారంభించారు. కేశవ స్మృతి సంవర్ధన సమితి సహకారంతో జరిగే శిక్షణ కార్యక్రమంలో నగరంలోని పలు ప్రాంతాల్లోని యువత పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ ప్రొప్రైటర్ ఉపేందర్, కేశవస్మృతి సంవర్ధన సమితి ప్రధాన కార్యదర్శి కొప్పారపు బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి



విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న ట్రస్ట్ బోర్డు ప్రతినిధులు

అంబర్‌పేట్: అవకాశాలను అందిపుచ్చుకోవాలని మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఎంఆర్. వెంకట్రావ్, తెలంగాణ గెజిటెడ్ అసోసియేషన్ ఎ.సత్యనారాయణ, రిటైర్డ్ ఆర్మీ మేజర్ శివకిరణ్, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అన్నపూర్ణ పేర్కొన్నారు. కాచిగూడలోని కాపు భవన్‌లో ప్రతిభ చూపిన 600 మంది విద్యార్థులకు రూ.12 లక్షల విలువైన చెక్కులను ఆదివారం అందించారు. ట్రస్ట్ బోర్డు ప్రతినిధులు పన్నల విష్ణువర్ధన్, పిల్లి శ్రీనివాస్‌రావు, ఆకుల నగేశ్, దేవేందర్, చంద్రశేఖర్, రాఘవేందర్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకులకు న్యాయం చేయండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు అధికారులు న్యాయం చేయాలని సంఘం అధ్యక్షులు డా.పరుశురాం కోరారు. తక్కువ వేతనానికి పని చేసి ఉద్యోగ విరమణ చేసే కాంట్రాక్టు అధ్యాపకులను ఖాళీ చేతులతో ఇంటికి పంపిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చాలా ఏళ్ల పోరాటంతో రాష్ట్ర కాంట్రాక్టు అధ్యాపకులకు ఉద్యోగ విరమణలో 60 ఏళ్ల వయో పరిమితిని పెంచినా ఓయూలో అమలు చేయడం లేదన్నారు.

క్రైస్తవుల మనోభావాలు దెబ్బతీయడం సరికాదు

ముషీరాబాద్: గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోన్ చర్చిలోకి పోలీసులు దౌర్జన్యంగా ప్రవేశించి క్రైస్తవుల మనోభావాలను దెబ్బతీశారని క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జెరుసలేము నత్తయ్య విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం క్రైస్తవ ఆధ్యాత్మిక సంస్థల్లో విబేధాలు సృష్టించడం దారుణమన్నారు. పోలీసులు ఓ వర్గానికి అనుకూలంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. ఏదైనా న్యాయ సమస్యలు ఉంటే ప్రార్థనల ముందు, ప్రార్థనల తరువాత చర్చించాలని.. దీనికి భిన్నంగా చర్చిలో ప్రార్థనలు జరుగుతున్న సమయంలో పోలీసులు చర్చిలోకి ప్రవేశించి పీటర్‌చారి వర్గాన్ని పోలీసులు దౌర్జన్యంతో బెదిరించడం అన్యాయమన్నారు. సానుకూల వాతావరణంలో చర్చల ద్వారా సమస్యను పరిష్కరించాలని కోరారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ప్రకటించారు. అధ్యక్షులు డా.సోమేశ్వర్, గౌరవ అధ్యక్షులుగా గోవిందు, నర్సయ్య, కోశాధికారిగా విష్ణు, ఉపాధ్యక్షులు వరలక్ష్మీ, శివశంకర్, సత్యనారాయణ రెడ్డి, ఫరుశరామ్, ప్రసన్న, రవీందర్ ఎన్నికయ్యారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

లిబర్టీ: పారిశుద్ధ్య కార్మికుల సేవలు ఎంతో గొప్పవని వాటికి వెలకట్టలేమని మున్సిపల్ లేబర్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ప్రీతంసింగ్, దిలీప్‌సింగ్ అన్నారు. మున్సిపల్ లేబర్ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో కార్మికులు, సిబ్బందికి దుస్తులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు కార్మికులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా తమ విధులను సక్రమంగా నిర్వహిస్తున్నారన్నారు.

ఉద్యమకారులకు అవకాశాలు కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ విద్యార్థి ఉద్యమకారులకు పాలన పదవుల్లో అవకాశాలు కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి మార్కలను కోరారు. ఆదివారం ఆర్ట్ కాలేజీలో ఓయూ విద్యార్థి జేఏసీ అధ్యక్షులు భట్టు శ్రీహరి అధ్యక్షత కాంగ్రెస్ విద్యార్థి ఉద్యమ సదస్సు జరిగింది. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టినాటి నుంచి అమలు చేస్తున్న పథకాలపై హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థి ఉద్యకారులకు పదవులతో పాటు హైదరాబాద్‌లో 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని తర్వలో సీఎం, డిప్యూటీ సీఎం, ఇతర మంత్రులను కోరనున్నట్లు తెలిపారు.

ప్రజల కోసం పనిచేయాలి

రాంగోపాల్‌పేట్: కేటీఆర్ ఇప్పటికైనా అబద్ధాలు మానుకుని ప్రజల కోసం పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కార్యదర్శి గంట సుదీర్ హెచ్చరించారు. ఆదివారం ఆయన సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నీతి, నిజాయితీ కలిగిన మాజీ ఎంపీ మధు యాష్కీగౌడ్‌కు ఫాంహౌజ్‌లు ఉన్నాయని అవాకులు, చెవాకులు మాట్లాడుతూ ప్రజలను తప్పుదోవపట్టించాలని కేటీఆర్ ప్రయత్నిస్తున్నారని ఆయన విమర్శించారు.

గురుకులాల సమస్యలు పరిష్కరించాలి

30న ఇందిరాపార్కు వద్ద ధర్నా



ముషీరాబాద్: రాష్ట్రంలో ఉన్న గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆగస్టు 30న ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బోనగిరి మధు, పొడపంగి నాగరాజులు పేర్కొన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం ఆధ్వర్యంలో ఈ ధర్నాను నిర్వహిస్తున్నామన్నారు. ఆదివారం విద్యానగర్‌లోని సీపీ భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ప్రధానంగా గురుకులాల్లో 80 శాతం గురుకులాలకు పక్కా భవనాలు లేవని, తక్షణమే గురుకులాలన్నింటికీ సొంత భవనాలు నిర్మించాలన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా చదువుకోడానికి, హాస్టల్‌కు వేర్వేరు భవనాల వసతి కల్పించాలన్నారు. ప్రత్యేకించి బాలికల గురుకులాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గురుకులాలలో ఫుడ్ సెక్యూరిటీ అధికారులతో తనిఖీలు నిర్వహించాలని తదితర డిమాండ్లపైన ఈ ధర్నాను నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. మేధావులు, ప్రజాస్వామికవాదులు హాజరై ఈ ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రణయ్, మంద నవీన్, రాష్ట్ర నాయకులు మామిడాల ప్రవీణ్, శ్యామ్ పాల్గొన్నారు.

మార్క్స్ సిద్ధాంతాలు నేటికి ఆచరణీయం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ పురేంద్రప్రసాద్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మార్క్స్ సిద్ధాంతాలు నేటికి ఆచరణీయమని ప్రొఫెసర్ పురేంద్రప్రసాద్ అన్నారు. అనేక మంది కార్మికులకు మార్క్స్ రాసిన గతి తరిక సిద్ధాంతం ఎంతగానో ఉపయోగపడిందన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఎస్‌వీకే ట్రస్ట్ ఆధ్వర్యంలో కారల్‌మార్క్స్–ఆర్థిక తాత్విక రాత ప్రతులు – 1844 పుస్తకంపై పరిచయ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ పురేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ఒక లక్ష్య సాధన కోసం మార్క్స్ విస్తృత అధ్యాయం చేశారని గుర్తు చేశారు. కార్మికవర్గంలో నేడు సంకుచిత భావాలపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. మతపరమైన భావాలను కార్మికుల్లో కూడా జొప్పిస్తున్నారని విమర్శించారు. తాము చేసిన ఉత్పత్తులను తామే కొనుగోలు చేయాల్సి వచ్చినప్పుడు ఎంతో బాధాకరంగా ఉంటుందన్నారు. ఎస్‌వీకే ట్రస్ట్ కార్యదర్శి ఎస్.వివేక్‌కుమార్, ఆర్థిక విశ్లేషకులు పాపారావు, కాపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆలె భాస్కర్

ముషీరాబాద్: నియోజకవర్గంలో గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంతంగా జరిగేలా భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు సమిష్టిగా కృషిచేయాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆలె భాస్కర్ సూచించారు. ఆదివారం సాయంత్రం బాకారంలో ముషీరాబాద్ నియోజకవర్గ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సమావేశం నియోజకవర్గం ఉత్సవ సమితి కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. మండపాల ఏర్పాటు, నిమజ్జన వేడుకలు, పూజలు వంటి అంశాలపై మండపాల నిర్వాహకులు, పోలీసుల మధ్య ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉత్సవ సమితి సభ్యులు సమన్వయ కర్తలుగా వ్యవహరించాలని సూచించారు. మండప నిర్వాహకుల సమస్యలు తెలుసుకుని పరిష్కారం కోసం గణేష్ ఉత్సవ సమితి ప్రత్యేక యాప్ రూపొందించిందని, సభ్యులందరూ డౌన్‌లోడ్ చేసుకుని మండపాల నిర్వాహకులను అందులో చేర్పించాలని సూచించారు. మండపాల వద్ద ఎలాంటి విభేదాలు ఘర్షణలు జరగకుండా సభ్యులు కృషి చేయాలన్నారు. ఉత్సవ సమితి సెంట్రల్ కమిటీ సభ్యులు నాయిని బుచ్చిరెడ్డి, బీజేవైఎం సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షులు మద్దూరి శివాజీ, ఉత్సవ సమితి నియోజకవర్గం కన్వీనర్ పరిమళ్‌కుమార్, శివాజీ, సలహాదారులు మహేందర్‌బాబు, శక్తిసింగ్, కో– ఆర్డినేటర్లు రాంరెడ్డి, తిరుమల్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నగర అధ్యక్షుడు కుమారస్వామి

కవాడిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు నేరుగా జీతాలు చెల్లించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో పలు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండ పద్మ, సీఐటీయూ నగర అధ్యక్షులు కుమారస్వామి తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ... ఔట్‌సోర్సింగ్ విధానం ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల శ్రమదోపిడి చేస్తున్నారని మండిపడ్డారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పిస్తూ.. హెల్త్‌కార్డులు మంజూరు చేయాలన్నారు. ప్రతి ఏటా రూ.1000 ఇంక్రిమెంట్ కల్పించి గవర్నమెంట్ విడుదల చేసే ప్రతి నోటిఫికేషన్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వెయిటేజ్ మార్కులు కలపాలన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వారి జీవితకాలం పనిచేసిన ఎలాంటి ఉద్యోగ ప్రోత్సాహకాలు కల్పించకపోవడం సరికాదన్నారు. ఉద్యోగి సర్వీస్‌లో మరణించిన, రిటైర్డ్ అయిన వారి కుటుంబసభ్యులకు రూ.10లక్షల ఆర్థికసాయం అందజేసి కుటుంబంలో అర్హులైన వారికి ఉద్యోగం కల్పించాలన్నారు. తెలంగాణ స్టేట్ ఆర్టిజెన్ ఎంప్లాయిస్ కార్పొరేషన్‌ను యాక్ట్ ఆఫ్ 1946 చట్టం ప్రకారం వెంటనే రిజిస్ట్రేషన్ చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జేఏసీ అధ్యక్షులు పులి లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి బొల్లం గోవర్ధన్, కోశాధికారి కోటాల సంతోష్ కుమార్, ఉపాధ్యక్షులు శ్రీధర్, కృష్ణ, సంధ్య, విజయలక్ష్మి, వినోద్, సంయుక్త కార్యదర్శులు ఎండీ నజీర్, జగదీష్, అరుణ్‌కుమార్, ఆర్గనైజర్ బిందు ప్రసాద్, నారాయణ, నేతలు యాదయ్య, ఎండీ రాజమ్మద్, సురేందర్, సునీత, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.